# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**విజయవాడ,**

**తేది : 13 జనవరి, 2023.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. - **జె.జయరాం,** ఆఫీసు కార్యదర్శి

**విషయం :** **కేంద్ర ప్రభుత్వం 27.1.2021న ప్రకటించిన విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా 700 రోజులుగా సాగుతున్న పోరాటం నేపథ్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ....**

**అయ్యా!**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వ్యూహాత్మక అమ్మకం చేయాలని కేంద్ర ప్రభుత్వ ఫైనాన్షియల్ సబ్ కమిట27.1.2021న ప్రకటన చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కార్మికులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులు కలిసి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా 700 రోజులుగా పోరాటం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా పలు సార్లు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. అయినా కేంద్ర ప్రభుత్వం పదేపదే పార్లమెంటులో విశాఖ స్టీల్‌ప్లాంటును అమ్ముతామని ప్రకటనలు చేస్తున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విలువ నిర్ణయించడానికి రెండు కమిటీలను వేశారు. జనవరి 30వ తేదీన విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద అఖిల పక్ష పార్టీలతో భారీ సభ నిర్వహించాలని పోరాట కమిటీ పిలుపునిచ్చింది.

రాష్ట్ర ప్రజల అభిప్రాయానికి భిన్నంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని రాష్ట్ర ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవడానికి రాష్ట్రం యావత్తూ ఏ విధంగా కృషి చేయాలని అఖిల పక్ష సమావేశం జరిపి చర్చించడం సమంజసమని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ భావిస్తున్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు పోరాడి సాధించుకున్న భారీ కర్మాగారం విశాఖ స్టీల్‌ప్లాంట్. నేడు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలకే మణిహారం. కేంద్ర ప్రభుత్వం కేవలం 5 వేల కోట్ల రూపాయిల పెట్టుబడి పెట్టింది. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ పన్నులు, డివిడెంట్ల ద్వారా 59 వేల కోట్ల రూపాయిలు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లించింది. విశాఖ నగరం అభివృద్ధి కావడానికి కీలకం కేంద్రప్రభుత్వ రంగ పరిశ్రమలు, అందులో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రధమ స్థానంలో ఉంది. 30 వేల మంది ప్రత్యక్షంగాను, మరో లక్ష మంది పరోక్షంగాను విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. 22 వేల ఎకరాల భూమిని 16 వేల మంది రైతులు త్యాగం చేసి అతి చౌకగా ఈ కర్మాగారానికి ఇచ్చారు. వీరిలో 8 వేల మందికి నేటికీ ఉద్యోగాలు రాలేదు. 2021-22 సంవత్సరానికి 945 కోట్లు లాభాల్లో ఉంది.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియాకు చెందిన 'పోస్కో' అనే స్టీల్ కంపెనీకి, మన దేశంలోని అదానీ కంపెనీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకున్నది. వ్యూహాత్మక అమ్మకం వెంటనే చేయలేకపోయినా విశాఖ స్టీల్ పరిశ్రమను బలహీనపర్చే చర్యలు చేపడుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని అత్యాధునికమైన 3వ బ్లాస్ట్ ఫర్నేష్‌ను సుమారు సంవత్సర కాలం నుండి ఉత్పత్తిని నిలిపివేసింది. స్టీల్ అమ్మకం ధరలు భారీగా ఉన్నప్పుడు ఉత్పత్తి తగ్గించి ఈ వార్షిక సంవత్సరం నష్టాల్లోకి నెడుతున్నది. అనేక ముఖ్య విభాగాల్లో ఉత్పత్తిని 30 శాతం పైగా తగ్గించింది. విశాఖ స్టీల్ పుట్టినప్పటి నుండి ఇటువంటి చర్యలు ఎన్నడూ యాజమాన్యాలు చేపట్టలేదు. విశాఖ స్టీల్ యాజమాన్య బోర్డులోని నలుగురు ముఖ్యమైన డైరెక్టర్లను కేంద్ర ప్రభుత్వం సంవత్సరకాలం పై నుండి నియామకాలు చేయలేదు.

విశాఖ స్టీల్ ఏకైక ప్రధాన సమస్య స్వంత గనులు లేకపోవడం. దీనివల్ల ప్రతి సంవత్సరం ఈ పరిశ్రమ 2 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయవలసి వస్తున్నది. స్వంత గనులు సమకూర్చకపోగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపర్చే కుట్ర ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి తీరని హాని తలపెట్టడమే.

ఈ నేపథ్యంలో పై విషయాలన్నీ చర్చించడానికి వీలైనంత త్వరగా అఖిలపక్ష కమిటీ ఏర్పాటు చేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తరపున కోరుతున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**

రాష్ట్ర కార్యదర్శి